ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని ఎల్లారెడ్డి, బాన్సువాడ, వర్ని మండలాల మీదుగా రుద్రూర్ వరకు చేపట్టిన 765డి రహదారి నిర్మాణమిది. కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండలం మహ్మదనగర్ సమీపంలో వంతెన వద్ద నిర్మించిన రోడ్డు.. ఏడాది తిరగక ముందే ఇలా పగుళ్లు తేలింది. రూ.కోట్లతో చేపట్టిన నిర్మాణ పనుల్లో డొల్లతనాన్ని ఇది రుజువు చేస్తోంది.

పనులు చూస్తే.. నవ్విపోతారు!

ప్రారంభానికి ముందే రోడ్డుకు పగుళ్లు

ఈనాడు, నిజామాబాద్

హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు నుంచి సంగారెడ్డి, మెదక్ జిల్లాలతో పాటు ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని ఎల్లారెడ్డి, బాన్సువాడ, వర్ని మండలాల మీదుగా రుద్రూర్ వరకు రూ.305 కోట్లతో 765డి రహదారి నిర్మాణ పనులు చేపట్టారు. కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో 55 కిలోమీటర్ల మేర పనులు మూడేళ్లుగా సాగుతున్నాయి. ఇప్పటికి 70 శాతం మేర పూర్తయ్యాయి. అయితే, పది కాలాల పాటు మన్నికగా ఉండాల్సిన పనులు నాసిరకంగా మారుతున్నాయి. పనులు పూర్తి కాక ముందే పగుళ్లు తేలుతుండటం నాణ్యతలోని డొల్లతనాన్ని తేటతెల్లం చేస్తోంది.

రుద్రూర్ వద్ద పగిలిపోయిన కాలువ స్లాబు

ఇదీ పరిస్థితి.. ☛ నస్రుల్లాబాద్, రుద్రూర్, నెమ్లి, మొగలాయిపల్లి ప్రాంతాల్లో కంకర వేశారు. నీళ్లు పట్టకపోవడంతో దుమ్ము లేస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ☛ పనులు నాసిరకంగా చేపట్టడంతో రుద్రూర్ మండలం అక్బర్‌నగర్ సమీపంలో నిర్మిస్తున్న రోడ్డు కుంగిపోయింది. ఇటీవల తాత్కాలిక మరమ్మతులు చేశారు. ☛ రుద్రూర్‌లో కొన్ని చోట్ల పాత తారునే మళ్లీ రోడ్డు పక్కన వినియోగిస్తున్నారు. పలు ప్రాంతాల్లో కాలువ స్లాబులు పగిలిపోయాయి. ☛ నిజామాబాద్-వర్ని మార్గంలో ఆర్టీఏ కార్యాలయం నుంచి రెండు కిలోమీటర్ల మేర, బోధన్ వెళ్లే మార్గంలో రోడ్డుకు ఇరువైపులా తవ్వి కంకర, మట్టి వేస్తున్నారు. నీళ్లు సరిగా పట్టడం లేదు. దీంతో నాణ్యతపై అనుమానాలు రేకెత్తుతుండగా వాహనాలు వెళ్లే సమయంలో వస్తున్న దుమ్ముతో ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు.

మరమ్మతులు చేస్తున్నాం

మహ్మద్‌నగర్ వంతెన సమీపంలోని రోడ్డు కోతకు గురైంది. ఆ ప్రాంతంలో మరమ్మతులు చేస్తాం. మిగిలిన చోట్ల పనులు నాణ్యతగా పూర్తి చేసేలా పర్యవేక్షిస్తాం.
- వినోద్ (ఆర్‌అండ్‌బీ ఏఈఈ)

మేట వేసి.. ఆశలు చిదిమేసి

పిట్లం మండలంలో ఇటీవల కురిసిన కుండపోత వర్షానికి పత్తి, సోయాబీన్, వరి పంటలు నీట మునిగాయి. కొన్ని చేనుల్లో వరద పారి కాల్వలు, గండ్లు ఏర్పడ్డాయి. వరి పంటలో మట్టి మేటలు పేరుకుపోయాయి. దిగుబడిపై ఆశలు చిగురిస్తున్న వేళ వర్షం నష్టం మూటగట్టిందని రైతులు ఆవేదన చెందారు. చిన్నకొడప్‌గల్‌లోని పొలంలోనిదే ఈ దృశ్యం. – న్యూస్‌టుడే, పిట్లం

నాటుకోడి విందు: బాన్సువాడ నియోజకవర్గంలో విధులు నిర్వర్తిస్తున్న ఓ ఎంఈవో పనితీరు తీవ్ర విమర్శలకు తావిస్తోంది. సదరు అధికారి దీర్ఘకాలంగా ఒకే చోట పనిచేస్తుండడంతో అతడి ఆగడాలకు అడ్డూఅదుపూ లేకుండా పోతోందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై కొందరు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఎంఈవో పాఠశాల పర్యవేక్షణకు వెళ్తే నాటుకోడితో విందు ఏర్పాటు చేయాల్సిందేనని.. లేదంటే కొర్రీలు పెడతారని పలువురు ఆరోపిస్తుండడం గమనార్హం.

నిధుల్లో చేతివాటం: జుక్కల్ నియోజకవర్గంలోని ఓ మండలంలో విధులు నిర్వర్తిస్తున్న ఎంఈవో ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. పాఠశాలలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే నిధుల్లో చేతివాటం ప్రదర్శిస్తున్నాడని.. గతంలో జరిగిన జనాభా లెక్కల సేకరణలో నిబంధనలు పక్కన పెట్టి కొందరు ఉపాధ్యాయుల పట్ల పక్షపాత వైఖరి ప్రదర్శించారని పలువురు చెబుతున్నారు. ఏకోపాధ్యాయ పాఠశాలల్లో బదిలీల్లో భాగంగా వెళ్లిన వారి స్థానాల్లో.. రెగ్యులర్ టీచర్లను కేటాయించకుండా పాత వారికి రిలీవింగ్ ఆర్డర్ ఇవ్వడంతో ఆయా పాఠశాలలు మూతపడే పరిస్థితి ఏర్పడింది. సదరు ఎంఈవో పనితీరుతో చాలా మంది ఉపాధ్యాయులు ఇబ్బందిపడుతున్నారు. కొందరు ఎంఈవోలు కొన్నేళ్లుగా జుక్కల్ నియోజకవర్గంలోనే పాతుకుపోవడం గమనార్హం.

నిఘా

దండించాల్సినోళ్లే.. దండుకుంటున్నారు

విధులకే మచ్చ తెస్తున్న కొందరు ఎంఈవోలు

ఈనాడు డిజిటల్, కామారెడ్డి

బడులను పర్యవేక్షించి, ప్రభుత్వ ఆశయాలను క్షేత్రస్థాయికి చేర్చాల్సిన బాధ్యత మండల విద్యాధికారులపై ఉంది. కానీ జిల్లాలో కొందరు ఎంఈవోలు గాడి తప్పుతున్నారు. విద్యను గాడిలో పెట్టాల్సిన వీరే స్వయంగా నిబంధనలకు నీళ్లొదులుతున్నారు. పాఠశాలల తనిఖీలు, రికార్డుల పరిశీలన పేరిట మామూళ్లకు తెర లేపుతున్నారు. కొన్ని పాఠశాలల్లోని లొసుగులను ఆసరాగా చేసుకుని అనధికార వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

ఇదీ పరిస్థితి.. ☛ జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న కొన్ని ప్రైవేటు పాఠశాలలకు కొందరు అధికారులు కాసుల కక్కుర్తితో వత్తాసు పలుకుతున్నారు. ఎలాంటి అనుమతులు లేకపోయినా.. అదనపు తరగతులు నిర్వహించుకునేందుకు అండగా నిలుస్తున్నారు. బాన్సువాడలోని ఓ ప్రైవేటు పాఠశాల విషయంలో ఇలాంటివి చోటుచేసుకోవడంతో సదరు అధికారులపై ఇటీవల డీఈవో ఆగ్రహం వ్యక్తం చేయడం గమనార్హం. ☛ ఉపాధ్యాయుల సర్దుబాటులోనూ పారదర్శకత కరవవుతోంది. అర్హత, అవసరాలను పక్కన పెట్టి తమకు కావాల్సిన వారికి, మామూళ్లు ముట్టజెప్పే వారికి అనుకూలంగా కొందరు ఎంఈవోలు ఉపాధ్యాయుల సర్దుబాటు చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీని వల్ల కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రమై విద్యార్థుల చదువుపై ప్రభావం చూపుతుంటే.. మరికొన్ని చోట్ల అవసరానికి మించి సిబ్బంది పేరుకుపోతున్నారు.

☛ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేసే నిధుల్లోనూ కొందరు ఎంఈవోలు చేతివాటం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇదే విషయమై డీఈవో మల్లికార్జున్‌ను 'ఈనాడు' సంప్రదించగా.. ఎంఈవోలు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నట్లు తన దృష్టికి రాలేదన్నారు. అలాంటివి ఏమైనా జరిగితే విచారించి చర్యలు తీసుకుంటామన్నారు.

శుభ్రత జాడేది?

మంచినీటి ట్యాంకుల నిర్వహణలో లోపాలు

పరిశీలన

అసలే వానాకాలం. తాగునీటి సరఫరాలో ఏమాత్రం లోపాలున్నా ప్రజలకు రోగాలు తప్పవు. జిల్లాలోని నాలుగు పురపాలికల్లో 14 మంచినీటి ట్యాంకులు ఉన్నాయి. నెలకు రెండు సార్లు ట్యాంకును శుభ్రం చేయాల్సి ఉన్నా చర్యలు కరవయ్యాయి. అధికారుల పర్యవేక్షణ లేక క్లోరినేషన్ ప్రక్రియ సక్రమంగా సాగడం లేదు. పైపులైన్ల లీకేజీతో ట్యాంకుల్లోకి కలుషిత నీరు సరఫరా అవుతోంది. బల్దియాల్లోని ట్యాంకులను 'న్యూస్‌టుడే' బృందం శనివారం పరిశీలన చేయగా శుభ్రతా లోపాలు వెలుగు చూశాయి.

★ పురపాలిక
☛ జనాభా
● వార్డులు
❒ నీటి అవశ్యకత
❖ ట్యాంకుల వద్ద పరిస్థితి

అపరిశుభ్ర పరిసరాలు

★ బాన్సువాడ ☛ 27,850 ● 19 ❒ 6.85 ఎంఎల్‌డీ ❖ నెలకోసారి ట్యాంకులను శుభ్రం చేస్తున్నామని అధికారులు చెబుతున్నా.. ట్యాంకు మెట్లు ఎక్కి శుభ్రం చేసిన దాఖలాలు లేవు. అడపాదడపా నీళ్లలో బ్లీచింగ్ పౌడర్‌ను కలుపుతున్నారు. ట్యాంకు చుట్టూ అపరిశుభ్రతే నెలకొంది. ఈ విషయమై ఏఈ జగన్మోహన్‌రెడ్డి స్పందిస్తూ.. ట్యాంకులను శుభ్రంగా ఉంచాలని సిబ్బందికి ఆదేశిస్తామన్నారు. – న్యూస్‌టుడే, బాన్సువాడ పట్టణం

సంగమేశ్వర్ కాలనీలో ట్యాంకు వద్ద అపరిశుభ్రత

చుట్టూ మొక్కలే..

★ బిచ్కుంద ☛ 20,847 ● 12 ❒ 2.85 ఎంఎల్‌డీ ❖ బిచ్కుందలో ట్యాంకు వద్ద పిచ్చి మొక్కలు పెరిగాయి. ట్యాంకు శుభ్రం చేయడానికి మెట్లు ఎక్కడానికి వీలు లేకుండా పోయింది. పైకి ఎక్కే క్రమంలో కాళ్లు మెట్లపై జారుతున్నాయి. ఈ విషయమై కమిషనర్ షేక్ హయ్యూం స్పందిస్తూ.. నెలకు రెండు ట్యాంకులను శుభ్రం చేసేలా చర్యలు చేపడతామన్నారు. క్లోరినేషన్ సక్రమంగా జరిగేలా శ్రద్ధ చూపుతామన్నారు.
– న్యూస్‌టుడే, బిచ్కుంద

లీకేజీలు.. కలుషిత నీళ్లు

★ కామారెడ్డి ☛ 1,04,256 ● 49 ❒ 20 ఎంఎల్‌డీ ❖ జిల్లాకేంద్రంలోని ట్యాంకుల్లో క్లోరినేషన్ ప్రక్రియ సక్రమంగా జరగడం లేదు. 2-3 నెలలకోసారి ట్యాంకులను శుభ్రం చేస్తున్నారు. పైపులైన్ల లీకేజీతో నీరు కలుషితమై ట్యాంకులకు సరఫరా అవుతోంది. మెరుగైన నీటి సరఫరాకు చర్యలు తీసుకుంటామని, లీకేజీలను సవరిస్తామని కమిషనర్ పర్వతాలు అన్నారు. పక్షం రోజులకోసారి ట్యాంకులను శుభ్రం చేసేలా సిబ్బందికి సూచిస్తామన్నారు. – న్యూస్‌టుడే, కామారెడ్డి పట్టణం

రంగాచారి కాలనీ వెళ్లే దారిలో ట్యాంకుకు సరఫరా చేసే పైపులైన్ లీకేజీ

గడ్డి, బురదతో..

★ ఎల్లారెడ్డి ☛ 19,750 ● 12 ❒ 2.28 ఎంఎల్‌డీ ❖ పక్షం రోజులకోసారి ట్యాంకులను శుభ్రం చేస్తున్నామని సిబ్బంది చెబుతున్నా.. వాస్తవానికి ట్యాంకులోకి దిగి శుభ్రం చేయడం లేదు. పైనుంచి బ్లీచింగ్ పౌడర్‌ను నీళ్లలో కలుపుతున్నారు. ట్యాంకు వద్ద గడ్డి, బురద ఉంది. ఈ విషయంపై కమిషనర్ జగ్జీవన్ స్పందిస్తూ.. ట్యాంకులను వారం రోజులకోసారి శుభ్రం చేసేలా సిబ్బందికి ఆదేశాలిస్తామన్నారు.
– న్యూస్‌టుడే, ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డిలో ట్యాంకు వద్ద అపరిశుభ్ర వాతావరణం

ఏ ఆధారం లేదు

ప్రస్తుతం ప్రభుత్వ పథకాలకు, బ్యాంకుల్లో కేవైసీకి, విద్యాసంస్థల్లో ప్రవేశాలకు ఆధార్ అవసరమవుతోంది. జిల్లాలో కొందరికి నేటికీ ఆధార్ కార్డు లేక అవస్థలు పడుతున్నారు. కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా 'ఆధార్' అందని ద్రాక్షలా మారింది. వారి వెతలపై మానవీయ కథనం.

14 సార్లు తిరిగినా.. లాభం లేదు

బీబీపేట మండలం జనగామకు చెందిన శివరాత్రి ప్రకాశ్(41)కు ఇప్పటివరకు ఆధార్ కార్డు లేదు. భార్య, ఇద్దరు పిల్లలతో జీవిస్తున్న ఆయన గత 15 ఏళ్లుగా దోమకొండ, కామారెడ్డి, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లోని ఆధార్ కేంద్రాలను సుమారు 14 సార్లు ఆశ్రయించారు. ప్రతి సారి వేలిముద్రలు, ఫొటో, ఇతర వివరాలను నమోదు చేస్తున్నప్పటికీ ఆధార్ ఎందుకు రావడం లేదో స్పష్టత లేదని ఆయన వాపోతున్నాడు. ఆధార్ లేక ప్రభుత్వ పథకాలు, బ్యాంకింగ్, రేషన్, ప్రభుత్వ ఆసుపత్రిలో ఓపీ సేవలు పొందలేకపోతున్నానని ఆయన అన్నారు. తన పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని ఆధార్ కార్డు వచ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నాడు. - న్యూస్‌టుడే, బీబీపేట

గతంలో దిగిన ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ పత్రాలను చూపిస్తున్న శివరాత్రి ప్రకాశ్

మానవీయం

అమ్మానాన్న లేరు

భిక్కనూరు మండలం బస్వాపూర్ గ్రామానికి చెందిన ఇద్దరు చిన్నారులు రామగళ్ల హరీశ్, రామగళ్ల అరవింద్ తల్లిదండ్రులను కోల్పోయారు. కరోనా సమయంలో తల్లిని, రెండేళ్ల క్రితం వికలాంగుడైన తండ్రిని కోల్పోయిన ఈ చిన్నారులకు నేటికీ ఆధార్ కార్డు లేక అవస్థలు పడుతున్నారు. హరీశ్ బస్వాపూర్ జడ్పీహెచ్‌ఎస్‌లో ఎనిమిదో తరగతి, అరవింద్ ప్రైమరీ పాఠశాలలో నాల్గవ తరగతి చదువుతున్నాడు. వృద్ధురాలైన నానమ్మ రాజవ్వ ఈ ఇద్దరు పిల్లల బాగోగులను చూస్తోంది. ఇటీవల హరీశ్‌ను భిక్కనూరులోని ప్రభుత్వ బాలుర వసతి గృహంలో ప్రవేశానికి తీసుకువెళ్లగా.. ఆధార్ కార్డు లేకపోవడంతో అక్కడి అధికారులు నిరాకరించినట్లు స్థానికులు తెలిపారు. ఏడాది క్రితం చిన్నారులకు ఆధార్ కోసం భిక్కనూరు తహసీల్దార్ కార్యాలయంలోని ఆధార్‌కేంద్రంలో దరఖాస్తు చేసినప్పటికీ తిరస్కరణకు గురయ్యాయి. హైదరాబాద్ వెళ్లాలని నిర్వాహకులు సూచించారని.. అంత స్తోమత లేక ఆధార్ ప్రక్రియ నిలిచిపోయినట్లు వృద్ధురాలు రాజవ్వ తెలిపారు. పెన్షన్ డబ్బులతో చిన్నారులకు భోజనం, చదువులు, ఇతర ఖర్చులు నెట్టుకొస్తున్నానని ఆమె వాపోయారు. ఆధార్ లేక ప్రభుత్వం అందిస్తున్న ఉచిత బియ్యం, ఇతర పథకాలను చిన్నారులు పొందలేకపోతున్నారని, అధికారులు ఇప్పించాలని ఆమె వేడుకుంటోంది.
- న్యూస్‌టుడే, భిక్కనూరు

తల్లిదండ్రులను కోల్పోయిన హరీశ్, అరవింద్‌లతో నానమ్మ రాజవ్వ

బల్దియా సమావేశం రసాభాస

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: కామారెడ్డి జిల్లాకేంద్రంలో బల్దియా ఛైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి అధ్యక్షతన శనివారం జరిగిన సమావేశం రసాభాసగా మారింది. అదనపు కలెక్టర్ గిరి హాజరై పుర అభివృద్ధిపై పలు మార్గదర్శకాలు చేశారు. వార్డుల అభివృద్ధికి తగిన ప్రాధాన్యం ఇస్తున్నామని ఛైర్‌పర్సన్ వెల్లడించారు. కాగా ఎజెండాలో పొందుపరిచిన అంశాలపై ప్రతిపక్ష సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. జిల్లాకేంద్రంలో అక్రమ నిర్మాణాలు, లేఅవుట్‌లపై అధికారుల వైఖరి సక్రమంగా లేదని భారాస సభ్యులు అన్నారు. సభావేదిక ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. వేదిక ఎదుట నుంచి పక్కకు తప్పుకోవాలని ఛైర్‌పర్సన్ ప్రతిపక్ష సభ్యులకు సూచించారు. అయినా వారు మొండికేసి అరగంటపాటు ఆందోళన చేశారు. పట్టణంలో సమస్యలపై యంత్రాంగం సకాలంలో స్పందించడం లేదని భాజపా సభ్యులు ఆరోపించారు. గతేడాది వరదలొచ్చిన చోట ఇప్పటికీ మరమ్మతులు కరవయ్యాయన్నారు. పారిశుద్ధ్యం, రోడ్లు అధ్వానంగా తయారయ్యాయన్నారు. చెత్త సేకరణపై యూజర్ ఛార్జీలు విధించేందుకు యత్నించడం అన్యాయమన్నారు.

పోడియం ఎదుట బైఠాయించిన భారాస కౌన్సిలర్లు, చిత్రంలో ఛైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి

అభ్యంతరాల మధ్య 9 అంశాలకు ఆమోదం

ఎజెండాలో పొందుపరిచిన 9 అంశాలకు పాలకవర్గ సభ్యుల అభ్యంతరాల మధ్య మెజార్టీ సభ్యుల సూచన మేరకు ఆమోదం తెలిపారు. వార్డుల్లో ప్రగతి పనులు చేపట్టేందుకు కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవ ఆమోదం తెలిపారు. ప్రతి వార్డుకు రూ.6 లక్షల చొప్పున నిధులు కేటాయించారు. జిల్లాకేంద్ర ప్రగతికి సమష్టి కృషి అవసరమని అదనపు కలెక్టర్ గిరి అన్నారు. ప్రజలకు మౌలిక వసతుల కల్పనకు యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. పురపాలక అధికారులు, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

నేర్పుతూ.. నేర్చుకుంటూ

కరాటేలో రాణిస్తూ స్ఫూర్తిగా నిలుస్తున్న గృహిణి

వనిత

న్యూస్‌టుడే,కామారెడ్డి క్రీడావిభాగం

ఆమె గృహిణి. ఇద్దరు పిల్లల తల్లి. అయితేనేం.. నిత్యం కరాటే సాధన చేస్తూనే తనకు తెలిసిన విద్యను పది మందికి పంచుతున్నారు. అంచలంచెలుగా రాణిస్తూ ఇటీవల అంతర్జాతీయ బ్లాక్‌బెల్ట్‌ను సైతం సాధించారు. ఆమే రాజంపేట మండలం ఆరేపల్లి గ్రామానికి చెందిన గడ్డమీది సుమాంజలి. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు ఆత్మరక్షణలో తర్ఫీదు ఇవ్వడమే తన వృత్తిగా మలుచుకున్న ఆమె ప్రస్థానం తన మాటల్లోనే..

బాల్యం నుంచే మక్కువ

మాది వరంగల్. నాకు కరాటే అంటే చాలా ఇష్టం. అమ్మానాన్నల ప్రోత్సాహంతో 5వ తరగతి నుంచే కరాటే సాధన చేస్తున్నా. పదో తరగతిలోనే బ్లాక్‌బెల్ట్ సాధించా. డిగ్రీ చదివాను. ఆ తర్వాత ఆరేపల్లికి చెందిన గడ్డమీది రమేశ్‌తో వివాహమైంది. ఆయన సైన్యంలో పనిచేస్తారు. నాకు ఇద్దరు పిల్లలు. ఏనాడూ కరాటే సాధన ఆపలేదు. వివిధ కరాటే టోర్నీల్లో అనేక బహుమతులు సాధించాను. కామారెడ్డిలో ఉంటున్న నేను ఉదయం చిన్నారులకు కరాటే తరగతులు నిర్వహిస్తాను. ఆ తర్వాత పలు ప్రైవేట్ పాఠశాలల్లో, 3 ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కరాటే శిక్షణ ఇస్తున్నాను.

జపాన్ మాస్టర్ల చేతుల మీదుగా అంతర్జాతీయ బ్లాక్ బెల్ట్, జ్ఞాపిక అందుకున్న సుమాంజలి

ఉచితంగా నేర్పిస్తా..

పిల్లలు, ఇంటి పనులతో పాటు నేను ఇష్టపడిన కరాటేను బ్యాలెన్స్ చేస్తాను. కరాటేలో రాణించడానికి భర్త, కుటుంబీకుల ప్రోత్సాహం ఎంతో ఉంది. ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు హైదరాబాద్‌లో తెలంగాణ స్పోర్ట్స్ అసోసియేషన్, జపాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణలో పాల్గొన్నాను. కిహాన్ టెక్నిక్స్, కటాఫ్‌లతో పాటు పలు సాంకేతిక అంశాల్లో మెలకువలు నేర్చుకున్నాను. అనంతరం నిర్వహించిన పరీక్షలో అంతర్జాతీయ బ్లాక్‌బెల్ట్ సాధించా. వచ్చే వేసవిలో పేద విద్యార్థులకు ఉచితంగా కరాటే నేర్పించాలని నిర్ణయించుకున్నాను.

వరదలొచ్చి ఏడాది.. పరిహారం ఏదీ..? వివరాలు 6లో..

బాలికల చదువుకు బాసట

SREE RAGHAVENDRA
B.Ed & B.P.Ed
COLLEGES, ARMOOR,
NIZAMABAD DIST.
Without Entrance
Seats available
9440090131
9966962792
9885285343

ఎంట్రెన్స్ లేకున్నా B.Ed.
వాయిదా ఫీజులు
మేనేజ్‌మెంట్ సీట్స్
JN కాలేజి
వేములవాడ
✆: 92469 32088

పదవీ విరమణ వేళ మీ ఆత్మీయులకు శుభాకాంక్షలు తెలపండి

మీ కుటుంబ సభ్యులు, మీ బంధువులు, మీ ఆఫీసులో సహోద్యోగులు ఎవరైనా రిటైర్ అవుతున్నారా! అయితే వారికి అందించండి అభినందన చందనాలు, ఆకాంక్షించండి వారి భావి జీవిత, సుఖమయ ఆనందాలు తెలియజేయండి.
ఈనాడు ద్వారా పదవీ విరమణ శుభాకాంక్షలు.
ఈనాడు ప్రకటనల విభాగం ★ GST వర్తించును
నిజామాబాద్: 8008709960 ,
8008709958, 9963849825,
బోధన్: 8008709960, ఆర్మూర్: 8008553004
కామారెడ్డి : 8977792553, బాన్సువాడ : 8008709959

ఆహ్లాద పరవళ్లు.. అసౌకర్యాల లోగిళ్లు..

న్యూస్‌టుడే, నిజామాబాద్ సాంస్కృతికం

ఉమ్మడి జిల్లాలోని చెరువులు, ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయి. వీటిని తిలకించేందుకు వస్తున్న పర్యాటకులకు అసౌకర్యాలు వేధిస్తున్నాయి.

పరిశుభ్రత కరవు

నిజాంసాగర్ ప్రాజెక్టు అందాలను తిలకించేందుకు వచ్చే పర్యాటకులను ఇక్కడి అసౌకర్యాలు అసంతృప్తికి గురిచేస్తున్నాయి. ప్రాజెక్టు ఆవరణ చెత్తాచెదారంతో అపరిశుభ్రంగా దర్శనమిస్తోంది. పర్యాటకులకు ఆహ్లాదం పంచేందుకు ప్రాజెక్టు ముఖద్వార సమీపంలోని గుల్‌గస్తా వద్ద ఫౌంటేయిన్ ఏర్పాటుచేశారు. నీరు విరజిమ్మేందుకు అవసరమైన పరికరాలు బిగించలేదు. అధికారుల పర్యవేక్షణ కొరవడి ఆ ప్రాంతం అపరిశుభ్రంగా, బురదగా మారింది. సాగర్ ప్రధాన కట్టపై సీసీ తొలగిపోవడంతో పలుచోట్ల గుంతలు ఏర్పడ్డాయి. ☛ 'పర్యాటకులు వ్యర్థాలు పారేస్తుండటంతో ప్రాజెక్టు పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. సిబ్బందితో పారిశుద్ధ్య పరిరక్షణ చర్యలు చేపడతాం.' అని నిజాంసాగర్ నీటిపారుదల శాఖ ఏఈ సాకేత్ అన్నారు. - న్యూస్‌టుడే, నిజాంసాగర్

ఫౌంటేయిన్‌లో నిలిచిన వర్షపు నీరు

☛ **ఎస్సారెస్పీ:** శ్రీరామసాగర్ ప్రాజెక్టు జలాశయాన్ని, అక్కడి ఉద్యానవన అందాలను చూసేందుకు వచ్చే పర్యాటకులకు విశాలమైన అతిథిగృహాలు నిర్మించాలి. బోటింగ్ సౌకర్యం ప్రారంభించాలి. భక్తులు ప్రతి శుక్రవారం గంగస్నానాలు ఆచరిస్తారు. కొన్నిసార్లు జారిపడి ప్రాణాలు కోల్పోతున్నారు. గజ ఈతగాళ్లను, బారికేడ్లను ఇక్కడ ఏర్పాటు చేయాలి.

☛ **అలీసాగర్‌లో:** ఎడపల్లి మండలంలోని అలీసాగర్ విశాలమైన చెరువు మధ్యలో ద్వీపం ఉంటుంది. ఇక్కడ బోటింగ్ సౌకర్యం లేదు. గుట్టపై పర్యాటకశాఖ వారి వసతి భవనం, ప్రీవెడ్డింగ్ షూట్ ఉంది. చెరువుకట్ట ప్రమాదకరంగా మారింది. కోతుల బెడద తీవ్రంగా ఉంది.

☛ **సిర్నపల్లి చెరువు:** ఇందూరు నయాగరా జలపాతంగా పేరొందిన ధర్పల్లి మండలంలోని సిర్నపల్లి చెరువు మత్తడి అందాలను చూసేందుకు వారంతాల్లో పర్యాటకులు వస్తున్నారు. చెరువు వద్దకు వెళ్లేందుకు దారి సరిగ్గా లేదు. జలపాతం వద్ద రక్షణ ఏర్పాట్లు చేయాల్సి ఉంది.

☛ **అశోక్‌సాగర్ చెరువు:** నిజామాబాద్ జిల్లా కేంద్రానికి సమీపంలోని అశోక్‌సాగర్ చెరువు, హోటల్ మధ్యలో సరస్వతీమాత విగ్రహం ఏర్పాటు చేశారు. ఇక్కడ చెరువు కట్ట ఎత్తు పెంచాలని పర్యాటకులు కోరుతున్నారు. బోటింగ్‌కు సైతం ప్రాంతం అనుకూలంగా లేదు.



దినకర్మ

ప్రేమానురాగాలతో మా అందరికీ వెలుగునిచ్చి, జీవనజ్యోతిగా ఆఖరివరకు దారి చూపావు... అలసి సొలసి విశ్రమించిన మీ పాదాలకు హృదయ నివాళులు అర్పిస్తూ... మీ జ్ఞాపకాలతో ముందుకు సాగుతూ.. మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుని ప్రార్థిస్తూ.... శోకతప్తహృదయాలతో....

కీ॥శే॥ ఆకుల భూమలింగం గారు
జననం: 07.03.1934 మరణం: 26.08.2026
R/o. అడ్లూర్ ఎల్లారెడ్డి.

కుమారులు - కోడళ్లు :
కీ॥శే॥ ఆకుల రాములు - శశిరేఖ
ఆకుల నరేందర్ - అరుంధతి
ఆకుల మహేందర్ - గంగారాణి
ఆకుల నాగరాజ్ - శ్వేత

కూతురు - అల్లుడు : గురువుల నవధ - ధర్మవీర్

మనుమళ్లు, మనుమరాళ్లు & సమస్త బంధుమిత్రులు

కార్యస్థలం : తేది: 30-08-2026 ఆదివారం రోజున మధ్యాహ్నం 12-00 గం॥ల నుండి మా స్వగృహం అడ్లూర్ ఎల్లారెడ్డి నందు జరుగును. నోట్: ఇదే కార్డుగా భావించి రాగలరు.

(c) eenadu

వరదలొచ్చి ఏడాది.. పరిహారం ఏదీ..?

న్యూస్‌టుడే, బోధన్

నిరుడు ఆగస్టు నెల చివర, సెప్టెంబర్‌లో నిజామాబాద్ జిల్లాలో కురిసిన భారీ వర్షాలు.. వచ్చిన వరదలు పంటలను తీవ్రంగా దెబ్బతీశాయి. పంట నష్టాన్ని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేసి సర్కారుకు నివేదించారు. నష్టం జరిగి ఏడాది అవుతున్నా ఇప్పటికీ రైతులకు పరిహారం అందకపోవడం గమనార్హం.

మొత్తం 24,038 ఎకరాలు..

జిల్లాలోని బోధన్, నిజామాబాద్ గ్రామీణం, ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గాల్లో గత వానాకాలంలో వరి, సోయా, మొక్కజొన్న, పసుపు తదితర పంటలు 24,038 ఎకరాల్లో దెబ్బతిన్నాయని, 21,610 మంది అన్నదాతలు నష్టపోయారని అధికారులు లెక్క తేల్చారు. బోధన్ మండలం కొప్పర్గ, హంగర్గ, సాలూర మండలం హున్సా, మందర్న, ఖాజాపూర్ గ్రామాలతో పాటు రెంజల్, నవీపేట మండలాల్లోని మంజీరా, గోదావరి నదుల పరివాహక ప్రాంతాల్లో వరదలొచ్చాయి. మూడు, నాలుగు రోజుల పాటు పంటలు నీటిలోనే ఉండటంతో పూర్తిగా దెబ్బతిని చేతికందకుండా పోయాయి. రైతులకు ఎలాంటి ఆదాయం రాకపోగా.. పెట్టుబడిని సైతం కోల్పోయారు. నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.10వేల చొప్పున పరిహారం అందిస్తామని అప్పట్లో ప్రభుత్వం ప్రకటించింది. అందుకు అనుగుణంగా నిధుల మంజూరు సంబంధిత జీవోను సైతం విడుదల చేసింది. కానీ పరిహారానికి సంబంధించిన నిధులు మాత్రం విడుదల చేయలేదు.

బోధన్ మండలం హంగర్గ గ్రామానికి చెందిన శ్యామల అనే మహిళా రైతు గత వానాకాలంలో నాలుగెకరాల్లో సోయా సాగు చేశారు. ఈ మేరకు ఎకరానికి రూ.30 వేల చొప్పున మొత్తం రూ.1.20 లక్షల పెట్టుబడి పెట్టారు. కోత దశలో ఉండగా.. వరదలు ముంచెత్తడంతో పంట పూర్తిగా దెబ్బతింది.

రెండు సీజన్లలోనూ నష్టం..

గత యాసంగిలోనూ అకాల వర్షాలు, వడగళ్ల కారణంగా జిల్లాలో మొత్తం 23,369 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నా.. 17,900 మంది కర్షకులు నష్టపోయారు. వర్షాలు, వరదలు, వడగళ్లతో రెండు సీజన్లలో పంటలు నష్టపోయి ఇబ్బందుల్లో ఉన్న అన్నదాతలకు పరిహారం కోసం ఎదురుచూపులు తప్పడం లేదు. జిల్లాకు సరిహద్దున ఉన్న మహారాష్ట్రలో పంట నష్టపోయిన రైతులకు అక్కడి సర్కారు పరిహారం అందించింది. ఇప్పటికైనా తమకు పరిహారం అందించి ఆదుకోవాలని జిల్లా రైతులు కోరుతున్నారు. ఈ విషయమై నిజామాబాద్ జిల్లా వ్యవసాయశాఖ అధికారి వీరాస్వామిని 'న్యూస్‌టుడే' సంప్రదించగా.. గతేడాది వానాకాలం, యాసంగి సీజన్లలో దెబ్బతిన్న పంటలు, రైతుల వివరాలను ఇది వరకే ప్రభుత్వానికి నివేదించామని తెలిపారు. పరిహారం ఇంకా విడుదల కాలేదని చెప్పారు.

గతేడాది కురిసిన వర్షాలకు హంగర్గలో దెబ్బతిన్న సోయా

“ఈ శ్రావణమాసంలో మీ ఈనాడు పెళ్లిపందిరితో... సంతోషకరమైన పెళ్లిళ్లకు శ్రీకారం!”

● కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు (అన్ని కులాల) అవివాహితులకు సువర్ణావకాశం
● నేడు కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు (అన్ని కులాల) వధూవరులకు 'ఈనాడు' పెళ్లిపందిరి ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం

తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన ఈనాడు పెళ్లిపందిరి, కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు (అన్ని కులాల) అవివాహిత వధూవరులకు ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నది. వివాహం కోసం ఎదురు చూస్తున్న వారు, సంబంధిత కుటుంబీకులు **నేడు (30 ఆగస్టు 2026 ఆదివారం) ఉదయం 9 గం. నుంచి సాయంత్రం 5.30 గం. వరకు** ఈ కార్యక్రమంలో పాల్గొని తమ ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్టర్ చేసుకోవచ్చు. మరిన్ని వివరాలకు **91543 40820 & 91549 92572** ఫోన్ నెంబర్లను సంప్రదించవచ్చు.

ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ ఫోన్ మరియు యాప్ ద్వారా కూడా చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ చేయదలచిన వధూవరుల బయోడేటా, ఫోటోలు పైన తెలిపిన వాట్సాప్ నంబర్లకు పంపవచ్చు.

నోట్: ఈ శ్రావణమాసంలో ప్రతి ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ నమోదుతో
★ ఒక నెల ప్రొఫైల్ హైలైటర్ (మీ ప్రొఫైల్‌ను ఎక్కువ మంది చూసుకునే అవకాశం)
★ అపరిమిత ఎక్స్‌ప్రెస్ ఇంట్రెస్ట్‌లు (మీకు నచ్చిన సంబంధాలకు ఆసక్తి తెలియజేసే అవకాశం)

అధ్వానం నుంచి ఆహ్లాదం వైపు..!

జిల్లాకే తలమానికంగా నిలుస్తున్న నీలకంఠేశ్వరాలయంలో ప్రతీ సోమవారం భక్తుల కోసం అన్నదానం నిర్వహిస్తున్నారు. భోజనం అనంతరం విస్తరాకులను ఆలయ రెండో ద్వారం వద్దే పారేయడంతో ఆ చోటు అంతా అధ్వానంగా మారి అసౌకర్యంగా ఉండేది. ఆలయ ఈవో రవీందర్, కమిటీ అధ్యక్షుడు తిరుపతి, ధర్మకర్తలు కొత్త ఆలోచనకు శ్రీకారం చుట్టారు. దాతల సహకారంతో రూ.1.50 లక్షలతో శివుడి విగ్రహాన్ని ఏర్పాటు చేసి చుట్టూ పూలమొక్కలను నాటి పెంచారు. ప్రస్తుతం ఆ ప్రాంతం భక్తులకు ఆధ్యాత్మికతతో పాటు ఆహ్లాదకర వాతావరణాన్ని పంచుతోంది. పలువురు సెల్ఫీలు తీసుకుంటున్నారు. శివుడి ప్రతిమకు వెనుక భాగాన చెట్టు రూపంగా ప్రత్యేక నిర్మాణాన్ని చేపట్టినట్లు ఈవో, కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు. – న్యూస్‌టుడే, నిజామాబాద్ సాంస్కృతికం

బాలికల చదువుకు బాసట

న్యూస్‌టుడే, నిజామాబాద్ విద్యావిభాగం

పేదరికంతో చదువుకోలేని వారికి ప్రభుత్వం, పలు సంస్థలు ఉపకార వేతనాలను అందిస్తున్నాయి. పీఎం యశస్వితో పాటు అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ అందించే ఉపకార వేతనాలకు ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రధాన మంత్రి యంగ్ అచీవర్స్ స్కాలర్‌షిప్ అవార్డ్ స్కీమ్ ఫర్ వైబ్రెంట్ ఇండియా(పీఎం యశస్వి), సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్ ద్వారా ఈ పథకం అమలు చేస్తున్నారు. ఇందుకు ఈ నెల 31 వరకు గడువు విధించారు.

ఉపకార వేతనాలకు ఈ నెల 31 వరకు అవకాశం

అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ ద్వారా.

అర్హత: ఏదైనా గుర్తింపు పొందిన పాఠశాల, కళాశాలలో రెగ్యులర్ విద్యార్థినిగా ఉత్తీర్ణులై ఉండాలి. ఈ విద్యాసంవత్సరానికి గుర్తింపు పొందిన యూజీ, డిప్లొమా ప్రోగ్రాంలో మొదటి సంవత్సరంలో ప్రవేశం పొంది ఉండాలి.

ఆర్థిక సాయం: ఎంపికైన విద్యార్థినులకు ఏడాదికి రూ.30 వేల చొప్పున ఉపకార వేతనం.

దరఖాస్తు విధానం: అర్హులైన విద్యార్థినులు అధికారిక అజీం ప్రేమ్‌జీ ఫౌండేషన్ స్కాలర్‌షిప్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్లో ఆగస్టు 31లోపు దరఖాస్తు చేసుకోవాలి. ఆధార్, డిగ్రీ బోనఫైడ్, బ్యాంకు ఖాతా, పది, ఇంటర్మీడియెట్ మెమోలు, పాస్‌పోర్టు సైజ్ ఫొటో సమకూర్చాలి.

ఎన్‌ఎస్‌పీలో...

అర్హులు: ఓబీసీ, ఈబీసీ, డీఎన్టీ వర్గాలకు చెందిన విద్యార్థుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.2.5లక్షలకు మించకుండా, గుర్తింపు పొందిన ఉన్నత పాఠశాలల్లో 9/11వ తరగతిలో ప్రవేశం పొంది ఉండాలి.

ఆర్థిక సాయం: 9, 10 తరగతుల విద్యార్థులకు ట్యూషన్, హాస్టల్ ఫీజులతో పాటు ఇతర ఖర్చులకు ఏటా రూ.75వేల చొప్పున, 11, 12 తరగతుల విద్యార్థులకు ఏటా రూ.1.25 లక్షల చొప్పున చెల్లిస్తారు.

దరఖాస్తు విధానం: విద్యార్థులు నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్ (ఎన్‌ఎస్‌పీ)లో ఆన్‌లైన్ దరఖాస్తులు సమర్పించాలి. గతేడాది మెరిట్ ఆధారంగా ఎంపిక జరుగుతుంది. బాలికలకు 30శాతం రిజర్వేషన్ కల్పించనున్నారు. ఆధార్, కుల, ఆదాయ, గత విద్యాసంవత్సర మార్కుల జాబితా, బ్యాంకు ఖాతా వివరాలు, బోనఫైడ్ ధ్రువపత్రాలు అందజేయాలి.

పీఏసీఎస్ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న బద్దం ఇంద్రకరణ్‌రెడ్డి, పక్కన ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, ఎంపీ సురేష్ షెట్కార్

రైతుల అభివృద్ధే కాంగ్రెస్ లక్ష్యం

భిక్కనూరు, న్యూస్‌టుడే: రైతులను ఆర్థికంగా బలోపేతం చేయడమే కాంగ్రెస్ లక్ష్యమని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ అన్నారు. శనివారం నిర్వహించిన రామేశ్వరపల్లి పీఏసీఎస్ పాలకవర్గం సభ్యుల ప్రమాణస్వీకార కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రైతులకు పంట రుణాలు, నాణ్యమైన విత్తనాలు, ఎరువులను సకాలంలో అందిస్తున్నామని అన్నారు. భిక్కనూరులో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ విద్యాలయానికి రూ.200 కోట్లు మంజూరయ్యాయన్నారు. గత భారాస ప్రభుత్వం రాష్ట్రాన్ని రూ.8 లక్షల కోట్లు అప్పుల పాలు చేసిందని కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ సురేష్ షెట్కార్ అన్నారు. పీఏసీఎస్ ఛైర్మన్‌గా బద్దం ఇంద్రకరణ్‌రెడ్డి, ఇతర పాలకవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి, డీసీవో రామ్మోహన్‌రావు, డీసీసీ మాజీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్, భిక్కనూరు ఏఎంసీ ఛైర్మన్ పాత రాజు, కాంగ్రెస్ మండలా అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, భీంరెడ్డి, సుదర్శన్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆఖరి బిల్లుకు తప్పని నిరీక్షణ

న్యూస్‌టుడే, నిజామాబాద్ కలెక్టరేట్

● నిజామాబాద్ సాయినగర్‌లో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇల్లు ఇది. స్లాబ్ వేయగా పనులు చివరి దశకు వచ్చాయి. చివరి బిల్లు రూ.లక్ష ఇప్పటికీ రాలేదని లబ్ధిదారుడు సురేందర్ పేర్కొన్నారు. అప్పు తెచ్చి పనులు చేయిస్తున్నట్లు తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారులకు నిరీక్షణ తప్పడం లేదు. జిల్లాలో మొదటి విడతలో 16,998 ఇళ్లు మంజూరు కాగా.. ఇందులో 4,783 నిర్మాణాలు పూర్తయ్యాయి. 5,049 ఇళ్లు స్లాబ్ దశ పూర్తి చేసుకోగా..రూఫ్ లెవల్‌లో 984, పునాది దశలో 1,522 ఉన్నాయి. అధికారులు నిర్ణయించిన లక్ష్యం మేరకు లబ్ధిదారులు గృహాలు నిర్మించుకుంటున్నారు. కానీ ఆఖరి బిల్లు సక్రమంగా జమకావడం లేదు. జిల్లా వ్యాప్తంగా సుమారు 3,849 మంది లబ్ధిదారులకి ఆఖరి బిల్లు రావాల్సి ఉంది. లబ్ధిదారులు కొందరు జిల్లా, మండల స్థాయిలో నిర్వహిస్తున్న ప్రజావాణికి సైతం ఫిర్యాదులు చేస్తున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఆవేదన

నిజామాబాద్ సాయినగర్‌లో స్లాబ్ దశకు వచ్చిన ఇందిరమ్మ ఇల్లు

అప్పులు తెచ్చి...

లబ్ధిదారులు చాలా మంది అప్పులు చేసి నిర్మాణాలు చేపడుతున్నారు. బిల్లులు జమ అవగానే అప్పులు చెల్లిస్తున్నారు. దీంతో లబ్ధిదారులు ఆర్థికంగా సమస్యలు ఎదుర్కొంటున్నారు. గత నాలుగు నెలల నుంచి ఇదే పరిస్థితి ఉంది. గుత్తేదారులు ఇళ్లు నిర్మించి అప్పగించినా.. బిల్లులు ఆలస్యమవుతుండటంతో అసహనం వ్యక్తం చేస్తున్నారు. కొందరు నిర్మాణాలను మధ్యలోనే వదిలేసి వెళ్తున్నారు.

నిధులు వచ్చేనా...

కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద గ్రామీణ ప్రాంతాల్లో నిర్మించే ఇళ్లకు రూ.72 వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షలు మంజూరు చేస్తోంది. చివరి బిల్లులో కేంద్రం వాటాతో పాటు రాష్ట్ర ప్రభుత్వ వాటాతో కలిపి మొత్తం రూ.48 వేలు జమ చేయాల్సి ఉంటుంది. ఉపాధి హామీ పథకం కింద పని దినాలకు రూ.28 వేలు, వ్యక్తిగత మరుగుదొడ్డికి రూ.12 వేలు అందిస్తున్నారు. కేంద్రం వాటా వస్తేనే చివరి బిల్లులు మంజూరయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇటీవలే కొందరు లబ్ధిదారులకు ఆఖరి బిల్లులు వచ్చాయి. ఏమైనా సమస్యలు ఉంటే కలెక్టరేట్‌లోని గృహ నిర్మాణ శాఖ కార్యాలయానికి వచ్చి తెలుసుకోవచ్చని హౌసింగ్ ఏఈ నివర్తి తెలిపారు.

ఒకే ఒక్కడు..!

న్యూస్‌టుడే, జుక్కల్

జుక్కల్ మండలంలో మొత్తం 30 పంచాయతీలకు గాను కేవలం ముగ్గురు మాత్రమే ఈ- పంచాయతీ ఆపరేటర్లను కేటాయించారు. అందులోనూ ఒక ఆపరేటర్‌ను బీర్కూర్ పంపగా, మరో ఆపరేటర్ ప్రసవ సెలవుపై వెళ్లారు. దీంతో ఒక్కరే విధులు నిర్వహిస్తుండడంతో పనులు ముందుకు సాగడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇక్కడున్న జూనియర్ అసిస్టెంట్‌ను డోంగ్లీ మండలానికి పంపినట్లు సమాచారం. ఆన్‌లైన్‌లో పొందుపరిచేందుకు కొత్త పెన్షన్ దరఖాస్తులు భారీగా వస్తున్నాయి. జనన, మరణ ధ్రువపత్రాల జారీ విషయంలోనూ ఇబ్బందులు తలెత్తున్నాయి. ఇప్పటికైనా ఈ-పంచాయతీ ఆపరేటర్లను జుక్కల్‌కు పంపాలని కార్యదర్శులు కోరుతున్నారు.

జుక్కల్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఈ- పంచాయతీ ఆపరేటర్ భూమగౌడ్

విత్తనక్షేత్ర అధికారికి మెమో

నాగిరెడ్డిపేట, న్యూస్‌టుడే: విధుల్లో నిర్లక్ష్యం వహించిన విత్తనక్షేత్ర అధికారి ఇంద్రసేన్‌కు మెమోను జారీచేసినట్లు జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రెడ్డి తెలిపారు. శనివారం నాగిరెడ్డిపేట్ మండలంలోని మాల్తుమ్మెద విత్తనక్షేత్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ సమయంలో విధులు నిర్వహించాల్సిన ఇంద్రసేన్ అక్కడ లేరు. ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా గైర్హాజరవడంతో మెమోను జారీ చేశామని మోహన్‌రెడ్డి తెలిపారు. విధులను నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే

'నియోజకవర్గంలో సీటుకో రేటు'

పెద్దకొడప్‌గల్, న్యూస్‌టుడే: జుక్కల్ నియోజక వర్గంలో సీటుకో రేటు చొప్పున బేరం సాగుతోందని మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే విమర్శించారు. పెద్దకొడప్‌గల్ మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన నియోజక వర్గ సమరభేరి సన్నాహక సమావేశానికి ఆయన హాజరై ప్రసంగించారు. సహకార సంఘాల ఛైర్మన్ పదవులకు రూ.25 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు వసూలుకు కాంగ్రెస్ పార్టీ ప్రయత్నం చేస్తోందని దుయ్యబట్టారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్, జడ్పీ మాజీ ఛైర్మన్ దఫేదర్‌రాజు, పెద్దకొడప్‌గల్ మాజీ ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి, పలు మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

తెలంగాణ విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని తెలంగాణ యూనివర్సిటీలోని ఆర్ట్స్ కళాశాల వద్ద శనివారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని రిజిస్ట్రార్ యాదగిరి ప్రారంభించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ యాదగిరి మాట్లాడుతూ... విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి విద్యతో పాటు, క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రాంబాబు, కోర్సు డైరెక్టర్ బాలకిషన్, వైస్ ప్రిన్సిపల్ లక్ష్మణ చక్రవర్తి, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వేడుకలను ప్రారంభిస్తున్న యూనివర్సిటీ రిజిస్ట్రార్ యాదగిరి

ఆకట్టుకున్న డైట్ విద్యార్థి అష్టావధానం

నిజామాబాద్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని నాగారంలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో శనివారం ప్రిన్సిపల్ శ్రీనివాస్ అధ్యక్షతన విద్యార్థి బానోత్ నితిన్ నిర్వహించిన అష్టావధానం ఆకట్టుకుంది. డా.గణపతి అశోకశర్మ ముఖ్యఅతిథిగా సాగిన అష్టావధానంలో నిషిద్ధాక్షరి కర్తగా డాక్టర్ గంట్యాల ప్రసాద్, అప్రస్తుత ప్రసంగికుడిగా కోకిల నాగరాజు, పృచ్ఛకులుగా డైట్ కళాశాల విద్యార్థులు వ్యవహరించారు. వీరు అడిగిన ప్రశ్నలు, అంశాలకు నితిన్ చకచకా సమాధానాలు, పద్యాలను చెప్పి మెప్పించారు. విద్యార్థిగా ఉంటూనే అవధానంలో రాణించడం గొప్ప విషయమని ఈ సందర్భంగా ప్రిన్సిపల్, పలువురు వక్తలు నితిన్‌ను ప్రశంసించారు. అనంతరం నితిన్‌ను పలువురు సత్కరించి, జ్ఞాపిక అందజేశారు. గౌరవ అతిథిగా మహేష్‌బాబు, శ్రీనివాస్, అధ్యాపకులు సంజీవరావు, దాస్, జ్యోతి, అరవింద్, ప్రతిభ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

★ అడవిలో నుంచి నగరంలోకి వచ్చిన ఓ జింక కళేబరం గత జూన్‌లో గోదాం రోడ్డులోని మురుగు కాలువలో లభ్యమైంది.

★ సిరికొండలోని హుస్సేన్‌నగర్ బీట్ కంపార్ట్‌మెంట్ రోడ్డులో అరుదైన మచ్చల పిల్లిని కొన్ని రోజుల కిందట గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మృత్యువాత పడింది.

జనావాసాల్లో సంచారం.... వన్యప్రాణికి సంకటం

మృత్యువాత పడుతున్న జంతువులు ● అడవుల పెంపకంతోనే రక్షణ

ఖలీల్‌వాడీ, న్యూస్‌టుడే(నిజామాబాద్):

అభివృద్ధి కార్యక్రమాలు, అక్రమార్కుల గొడ్డలివేటుకు వనాలు తగ్గిపోతున్నాయి. దీంతో తగిన ఆహారం, నీరు దొరకక, రక్షణ లేక వన్యప్రాణులు జనావాసాల్లో వస్తున్నాయి. రాత్రి సమయంలో రోడ్లపై సంచరిస్తూ వాహన ప్రమాదాల్లో మృత్యువాత పడుతున్నాయి. ఇందులో కొన్ని అరుదైన జాతికి చెందినవి ఉండటంతో వాటి సంతతి తగ్గిపోయే ప్రమాదం ఉంది. వన్య ప్రాణులు అడవి నుంచి బయటకు రాకుండా రక్షణ కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

జిల్లాలో ఇలా..

జిల్లాలోని నిజామాబాద్, ఆర్మూర్ అటవీ డివిజన్లలో 86 వేల హెక్టార్లలో అడవులు విస్తరించి ఉన్నాయి. ఇందులో నిజామాబాద్ నార్త్, సౌత్, ఇందల్‌వాయి, సిరికొండ, కమ్మర్‌పల్లి, ఆర్మూర్, వర్ని రేంజ్‌లు ఉన్నాయి. వీటి పరిధిలో జింకలు, నక్కలు, అడవి పిల్లులు, కుక్కలు ఇలా చాలా వరకు ఉన్నాయి. గడిచిన మూడేళ్లలో జింకలు, అడవి పిల్లుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. అడవిలో గల అరుదైన జాతి జంతువులు బయటకు రాకుండా ప్రకృతితో కలిసి ఉండేలా చర్యలు తీసుకోవాలి. అప్పుడే వీటి సంతతి అంతరించి పోకుండా ఉంటుంది.

ఇవి సమకూర్చాలి..

వన్యప్రాణులు అటవీ ప్రాంతాన్ని దాటి బయటకు రాకుండా అధికారులు ప్రణాళిక రూపొందించాలి. ముఖ్యంగా జంతువుల ఆహార అవసరాలకు అనుగుణంగా గడ్డిక్షేత్రాలు, పండ్ల మొక్కలు పెంచాలి. దాహార్తి తీర్చడానికి ఏర్పాట్లు చేయాలి. ఇలా చేస్తే జంతువులు ఆహారం కోసం అడవి విడిచి బయటకు రాకుండా ఉంటాయి.

రేంజ్‌ల వారీగా ఇలా..

రేంజ్‌లు	జింకలు	అడవి పిల్లులు
నిజామాబాద్ నార్త్	185	12
నిజామాబాద్ సౌత్	284	46
ఇందల్‌వాయి	352	65
సిరికొండ	185	32
కమ్మర్‌పల్లి	63	18
ఆర్మూర్	93	8
వర్ని	115	15

మనస్తాపంతో యువకుడి బలవన్మరణం

నస్రుల్లాబాద్ : ఇంటి నిర్మాణానికి చేసిన అప్పు తీర్చలేక మనస్తాపం చెందిన ఓ యువకుడు అదే ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. బస్వాయిపల్లికి చెందిన **విఠల్** (28) వ్యవసాయ కూలీగా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అతను 2023లో సుమారు రూ.20లక్షలు అప్పు చేసి ఇల్లు నిర్మించుకున్నాడు. ఆ రుణాన్ని తీర్చేందుకు ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీల వద్ద రూ.13 లక్షలు అప్పు తీసుకున్నాడు. కూలీ పని ద్వారా వచ్చే ఆదాయంతో నెలవారీ వాయిదాలు సక్రమంగా చెల్లించలేదు. ఈ నెల 22న ఫైనాన్స్ కంపెనీ సిబ్బంది ఇంటిని జప్తు చేయడంతో మనోవేదనకు గురయ్యాడు. 28వ తేదీన పొలానికి వెళ్తానని కుటుంబీకులకు చెప్పి వెళ్లాడు. సాయంత్రమైనా తిరిగి రాకపోవడంతో కుటుంబీకులు గాలించారు. విఠల్‌కు ఫోన్ చేస్తే జప్తు చేసిన ఇంట్లో నుంచి ఫోన్ రింగ్ అయిన శబ్దం వినిపించింది. కుటుంబీకులు లోపలికి వెళ్లి చూసి గదిలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించారు. తన భర్త ఇంటి నిర్మాణానికి చేసిన అప్పు తీర్చలేక మనస్తాపంతో బలవన్మరణం చెందాడని భార్య అనురాధ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు చెప్పారు. విఠల్‌కు పావని (5), మైథిలి (3) కుమార్తెలు ఉన్నారు.

అవార్డు ప్రదానం

తెలంగాణ విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా శనివారం యూనివర్సిటీలో ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న డాక్టర్ బోర్లకుంట రాజయ్య నేత (సహాయ ఆచార్యుడు) హైదరాబాద్‌లో మేజర్ ధ్యాన్‌చంద్ ఎక్సలెన్స్ అవార్డు-2026 అందుకున్నారు. అవార్డును తెలంగాణ ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య బాలకిష్టారెడ్డి, వైస్ ఛైర్మన్ ఆచార్య పురుషోత్తం బహూకరించినట్లు తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్ నారాయణ ముదిరాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా రాజయ్య నేతను వీసీ యాదగిరిరావు, రిజిస్ట్రార్ యాదగిరి అభినందనలు తెలిపారు.

హాకీ విజేతలు.. గర్గుల్ జడ్పీహెచ్‌ఎస్, కామారెడ్డి కేజీబీవీ జట్లు

కామారెడ్డి క్రీడావిభాగం, న్యూస్‌టుడే: కామారెడ్డి ఇందిరాగాంధీ స్టేడియంలో శనివారం అండర్-17 బాలబాలికల హాకీ టోర్నీని నిర్వహించారు. బాలుర విభాగంలో.. గర్గుల్ జడ్పీహెచ్‌ఎస్, స్ప్రింగ్ ఫీల్డ్ పాఠశాల జట్లు, బాలికల విభాగంలో.. కామారెడ్డి కేజీబీవీ, కామారెడ్డి ఎంజేబీటీ జట్లు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. డీవైఎస్‌వో రంగ వెంకటేశ్వర్‌గౌడ్, హాకీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నీలం లింగం, అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, నోడల్ అధికారి వెంకట్, హాకీ అసోసియేషన్ కోశాధికారి నోముల మధుసూదన్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు లక్ష్మణ్, ఆంజనేయులు, స్రవంతి, మానస తదితరులు పాల్గొన్నారు.

విజేతలుగా నిలిచిన బాలుర, బాలికల జట్లు

EENADU Classifieds

BUSINESS SERVICES

మా యొక్క రిజిష్టర్ చిట్‌ఫండ్స్ ప్రై.లి. వ్యాపారాన్ని మరింత విస్తరించడానికి ఫైనాన్షియర్స్/ పెట్టుబడిదారులు (ఫుల్ సెక్యూరిటీ) కావలెను. M/s యోజన రూరల్ చిట్‌ఫండ్ ప్రై.లి. 4-542-543, 544 శ్రీ రాజరాజేశ్వరి నగర్, కొండాపూర్, శేరిలింగంపల్లి, Hyderabad-500084. ✆: 96036 74849. ఏజెంట్స్ కావలెను.

BUSINESS OFFER

ప్రీ లాంచింగ్ ప్రొడక్ట్ బేసిడ్ ఇన్వెస్ట్‌మెంట్, బైనారి బిజినెస్ కాన్సెప్ట్ స్త్రీ/పు. నిరుద్యోగులు, MLM, మార్కెటింగ్ లీడర్స్ లక్షల్లో వీక్లీటీమ్ సంపాదన. ✆ 7013203996.

FINANCIAL SERVICES

లేక్‌ల్యాండ్ కంపెనీ - అన్నిలోన్లు ప్రాపర్టీ, LAP, బిజినెస్, వ్యవసాయ, టేకోవర్ పర్సనల్, గ్రూప్ లోన్లు @ 7% వడ్డీ. ఏజెంట్లు కావలెను. మంచి కమీషన్. ✆: 8961920779.

REAL ESTATE

HOUSE FOR SALE

Borgaon, Hyd-Rd 5min, 211 SY, Gflr, 3BHK, 18Yr Old, South/f, Bore, Marble, Rs.95L. Phone Number ✆ 6300219075.

కామారెడ్డి విద్యానగర్, NGO's కాలనీ రోడ్ నెం. 6లో 215 చ.గ. G+3+Pent House 5000 చ.గ. 2 సం. భవనము అమ్మబడును. సం. 9290496677.

LAND FOR SALE

Tamilnadu Arunachala (Tiruvannamalai) 5.87 Acres Sale. Suitable for Ashrams, Institution, Farm Houses. ✆ 9840651404.

Sites Available for Construction 1) Kanteshwar Housing Board 105syd. 2) Gangastan-1, 140sqd. Contact: 9493599381, 9491044393.

MANGO FARM for sale
12.5 Acres, RTC Bus Route Road, Near SIDDIPET- MUSTABAD "T" JUNCTION, WITH 3 BORE WELLS. TOTAL FENCING
PH:9391515600

PLOT FOR SALE

Plot for Sale 400yds (36'x100') Semi-Commercial, Westface, 55,000/- per yard, Usha Mayuri Multiplex Backside, Nzb. ✆: 9490567425.

Prime Plot for Sale in Posh Locality - Maruthi nagar of Extent of 304 Sqyds - Size: 36x76- Full Vasthu W/F with 40 ft. Road, 42K per Yard, Neg. Contact: Phone Number : 8328181273, 8309571212.

DTCP & RERA Hyd కి సమీపంలో సదాశివపేట ఆరూరు నందు 300 ఎకరాల్లో మెగా వెంచర్‌లో గజం 8999/- మాత్రమే. 9959616622.

JOBS

Female Receptionist Invotech fire Safety Training, NZBD. Institute లో పనిచేయుటకు కావలెను. NZB. లోకల్‌వారికి ప్రాధాన్యత ✆: 9553813354.

నిజామాబాద్‌లో ఉన్న చిన్నపిల్లల స్కూల్‌లో పనిచేయుటకు ఆయమ్మ కావలెను. (బాత్రుములు కూడా కడగవలెను) జీతం: 8000/- పనివేళలు: 8గం॥ to 5-30 వరకు ✆: 8897636892.

భారత్ ఖాదిభండార్ బట్టల దుకాణములో పనిచేయుటకు అనుభవము గల వర్కర్లు కావలెను. భారత్ ఖాది భండార్, రైల్వే స్టేషన్ రోడ్, నిజామాబాద్. ✆ 9440476061

హైదరాబాద్ సిటీలో బ్రాహ్మణ కుటుంబానికి వంట చేయడానికి బ్రాహ్మణ స్త్రీలు కావలెను. జీ॥ 25K-30K, భోజనము+వసతి కల్పించబడును. వెంటనే ✆ 9866252220.

Vittal Agencies మిర్చికంపౌండ్ నిజామాబాద్ నందు పనిచేయుటకు సేల్స్‌బాయ్స్ & సప్లై చేయుటకు బాయ్స్ కావలెను. సంప్ర॥. 9666577804.

లక్ష్మీ TVS వినాయక్‌నగర్, NZB షోరూంలో సేల్స్‌మేనేజర్స్, సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ (M/F), సర్వీస్ మేనేజర్స్, సర్వీస్ అడ్వైజర్స్, అకౌంటెంట్స్, టెలికాలర్స్ (F), కంప్యూటర్ ఆపరేటర్, మెకానిక్స్, వాషింగ్ బాయ్స్ కావలెను. సాలరీ+ఇన్సెంటివ్స్. 9704204164

నిజామాబాద్ శ్రీనగర్‌కాలనీ, ఇంట్లో పనిచేయడానికి లేడీవంట మనిషి మరియు ఆయమ్మలు కావలెను. సంప్రదించండి. Phone Number : 77999 91773.

ఆర్వి డిజిటల్స్ - తిరుపతి నందు పనిచేయుటకు గ్రాఫిక్ డిజైనర్స్ (ఫోటోషాప్, కోరల్ డ్రా తెలిసినవారు), మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ✆: 86880 56789.

Exp. ఆయాలు / వార్డ్ బాయ్స్ నర్సులు కావలెను. జీతం: 21000/- నుండి 30,000/- వరకు ఇవ్వబడును. Hyd లో. Ph: 8096770770/ 9985601234.

Hyd లోని ప్రముఖ టిఫిన్ సెంటర్‌లో స్టాల్‌బాయ్స్, సూపర్ వైజర్స్ (ఫ్రెష్/Exp) కావలెను. జీ: 18K, 12 గం॥ ఫ్రీ వసతి+భోజనం. 9666934949/9963165905.

MKR కంపెనీకు ఆఫీస్ అసిస్టెంట్ కం డిజిటల్, మార్కెటింగ్‌కు ఇంగ్లీషు & హిందీ (తప్పనిసరి) వచ్చిన మరియు సిస్టమ్ నాలెడ్జ్ ఉన్న లేడీస్టాఫ్ కావలెను. మంచి జీతం వయస్సు 35 సం॥లోపు నిజామాబాద్ టౌన్ వారికి ప్రాధాన్యత ✆ 9948112204.

To Book Your Classified Advertisements Please Call: ✆ 8008709960
★ GST వర్తించును.

WANTED
హైదరాబాద్ లోని ఇబ్రహీంపట్నం దగ్గరలో ఉన్న మా ఫామ్ ల్యాండ్ లో రెండు కుటుంబాలు ఉన్నాయి. వారు వివిధ రకాల పనులు చేస్తుంటారు.
ఆ కుటుంబాలు చేసే పనులు సూపర్‌వైజు చేయడానికి ఒక ఇంచార్జ్ కావాలి.
నెలకు జీతము 30,000.
వయస్సు 25 నుండి 40 సం॥ లు.
అర్హత - ఇంటర్మీడియట్.
ఏదైనా రంగంలో ఇంచార్జ్ కానీ సూపర్వైజర్ గా కానీ పనిచేసిన అనుభవం ఉండాలి.
ఇంటర్వ్యూ తేదీలు 31-08-26, 01-09-26 & 02-09-26.
టైమింగ్స్ : ఉ. 10 నుండి 6 సా.
ఇంటర్వ్యూ కొరకు ఫోటోలు తీసుకొని రాగలరు.
సంప్రదించండి :
కామినేని హాస్పిటల్ దగ్గర, సూర్యోదయ కాలనీ, L.B.నగర్, హైదరాబాద్. Ph. 7842226933.
Mail : hradmin@sribalajiads.in

FACULTY/ TEACHERS

Wanted Teachers (M/F) for Sci./Soc/Eng Subjects Good Salary Preferred Experienced & English Medium Back ground, Classes 2 to 6th Class working Hrs: 8-45 am to 5-15pm, Location-NZB. ✆: 8074081861.

WANTED FACULTY
HIGH SCHOOL TEACHER
* Biology Teacher Post -1
For Application: Every School working Day
Free Bus facility available (8km) from Nizamabad.
SRI SAI VIDYANIKETHAN HIGH SCHOOL
Vill: Kanjar, Mdl: Mopal
District: NIZAMABAD
✆ 99894 48828

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
నిజామాబాద్: 8008709960, 8008709958, 9963849825
బోధన్: 8008709960 ఆర్మూర్: 8008553004
కామారెడ్డి : 8977792553, బాన్సువాడ : 8008709959
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80081 11479

(c) eenadu

ఏషియన్ ప్రియ — ఈనాడు సినిమాలు

ఇరుముడి 11.30 2.30 6.30 9.30
విశ్వనాథ్ అండ్ సన్స్ 11.00 2.30 6.00 9.30
ఏషియన్ దర్శన్
ఇరుముడి 11.00 2.00 6.00 9.00
వి సినిమాస్ శాంతి
టాక్సిక్ 10.45 2.15 6.00 9.45
– న్యూస్‌టుడే, కామారెడ్డి పట్టణం

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
బాన్సువాడ 83284 29129
కామారెడ్డి 93970 82242
ఎల్లారెడ్డి 94410 27839
జుక్కల్ 94924 00777

●● **స్పందన :** బాన్సువాడ ఇస్లాంపురాలోని మురుగు కాల్వల్లో చెత్త నిల్వలు పేరుకుపోవడంతో దుర్వాసన వస్తుందని స్థానికులు 'న్యూస్‌టుడే' దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయాన్ని పర్యావరణ ఇంజినీర్ హన్మాండ్లు వద్ద ప్రస్తావించగా ఆయన సిబ్బందితో చెత్త నిల్వలు తొలగింపజేసి సమస్య పరిష్కరించారు. **న్యూస్‌టుడే, బాన్సువాడ పట్టణం**

●● పాత బాన్సువాడ అరాఫత్ కాలనీలో వీధి దీపాలు వెలగకపోవడంతో రాత్రి వేళ ఇబ్బందిగా ఉందని స్థానికులు 'న్యూస్‌టుడే' దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయాన్ని వీధి దీపాల పర్యవేక్షకుడు సాయికిరణ్ వద్ద ప్రస్తావించగా ఆయన సిబ్బందితో మరమ్మతులు చేయించి సమస్య పరిష్కరించారు.
న్యూస్‌టుడే, బాన్సువాడ పట్టణం

●● కామారెడ్డి జిల్లాకేంద్రంలో 9,10వ వార్డుల్లో చెత్త తీయడం లేదని శ్రీహరి, లింగం తెలపగా పారిశుద్ధ్య బాధ్యుడు ప్రశాంత్ చెత్త తీయించారు.
●● కామారెడ్డిలో 2వ వార్డులో కాల్వ పూడిక తీయడం లేదని బాలేషం తెలపగా పారిశుద్ధ్య బాధ్యుడు ప్రశాంత్ స్పందించారు. కాల్వ పూడిక తీయించారు.
- న్యూస్‌టుడే,కామారెడ్డి పట్టణం

●● ఎల్లారెడ్డి మండలం రేపల్లెవాడ గ్రామంలో దోమ కాట్లతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు తెలపగా పంచాయతీ కార్యదర్శి సిద్ధిరాములు స్పందించారు. దోమల నివారణకు సిబ్బందితో ఫాగింగ్ చేయించారు. **- న్యూస్‌టుడే, ఎల్లారెడ్డి**

●● మత్తమాల గ్రామంలో పలు చోట్ల వీధి దీపాలు వెలగడం లేదని శివప్రసాద్ తెలపగా గ్రామ కార్యదర్శి రమ్యశ్రీ స్పందించారు. వెలగని చోట సిబ్బందితో కొత్త వాటిని అమర్చారు. దీపాలు వెలిగే విధంగా చర్యలు చేపట్టారు. **- న్యూస్‌టుడే, ఎల్లారెడ్డి**

ప్రయాణ ప్రాంగణంలో సీసీ కెమెరాల ఏర్పాటు

ఎల్లారెడ్డి, న్యూస్‌టుడే : ఎల్లారెడ్డి ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలో ఐదు సీసీ కెమెరాలను పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ నెల 23న బస్సు ఎక్కుతున్న సమయంలో ఇద్దరు మహిళల మెడల్లో ఉన్న బంగారు గుండ్లు గుర్తు తెలియని వ్యక్తులు కొట్టేశారు. మూడు తులాల గుండ్లు పోయినట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ప్రయాణ ప్రాంగణంలో చోరీలు జరగకుండా రోజుకు ఇద్దరు కానిస్టేబుళ్లతో నిఘా ఏర్పాటు చేశారు.

వనమహోత్సవం

నాగిరెడ్డిపేట,న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని రేణుక ఎల్లమ్మ ఆలయ ప్రాంగణంలో 1500 ఈతమొక్కలను ఎక్సైజ్ అధికారుల సమక్షంలో గౌడ సంఘం సభ్యులు శనివారం నాటారు. ఎక్సైజ్ శాఖ అధికారి షాకీర్ అహ్మద్, గౌడ సంఘం అధ్యక్షుడు యాదగిరిగౌడ్, గ్రామసర్పంచి వంశీగౌడ్, సభ్యులు శ్రీనివాస్‌గౌడ్, సంతోష్‌గౌడ్, మచ్చేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

నర్సింహుడికి లక్ష పుష్పార్చన

మాచారెడ్డి, న్యూస్‌టుడే: శ్రావణమాసం శనివారం సందర్భంగా చుక్కాపూర్ లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానంలో లక్ష పుష్పార్చన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ ఛైర్మన్ కమలాకర్ రెడ్డి, ఈవో ప్రభు రాంచంద్రం, డైరెక్టర్లు లక్ష్మీరాజం, అంజయ్య పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు విద్యుత్తు సౌకర్యం

కామారెడ్డి కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలోని 264 అంగన్‌వాడీ కేంద్రాలకు విద్యుత్తు సౌకర్యం కల్పించినట్లు ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ సాలియానాయక్ శనివారం పేర్కొన్నారు.

స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ

బాన్సువాడ గ్రామీణం, న్యూస్‌టుడే : ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి శనివారం పోచారంలో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఆర్డీవో రవీందర్‌రెడ్డి, తహసీల్దార్ నరేందర్‌గౌడ్, సర్పంచి రమేష్, ఉపసర్పంచి లతీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో స్వచ్ఛ భారత్

మద్నూర్ న్యూస్‌టుడే: సలాబాత్‌పూర్ హనుమాన్ ఆలయంలో భక్తులు స్వచ్ఛ భారత్ కార్యక్రమం చేపట్టారు. మందిరం, పరిసరాలు శుభ్రం చేసి తమ భక్తిని చాటుకున్నారు. జగద్గురు నరేంద్రచార్య ఆదేశానుసారం ఈ కార్యక్రమం నిర్వహించినట్లు సభ్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ఉప పీఠం సేవా సమితి సభ్యులు, జిల్లా సేవా సమితి సభ్యులు, తాలుకా పదాధికారులు, హిందూ సంగ్రామ్ సేన, మహిళా సేన, యువ సేన కార్యకర్తలు పాల్గొన్నారు

సర్పంచిపై దాడి

బిచ్కుంద గ్రామీణం, న్యూస్‌టుడే: బిచ్కుంద మండలంలోని ఓ గ్రామంలో శనివారం గ్రామ సభ నిర్వహిస్తుండగా వాటర్‌మెన్ సర్పంచిపై దాడి చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు.

'సర్' విచారణకు మినహాయింపులు..

● కుటుంబీకుల్లో ఎవరైనా హాజరు కావచ్చు ● జిల్లాలో 36,664 నోటీసుల జారీ పూర్తి

న్యూస్‌టుడే,కామారెడ్డి కలెక్టరేట్

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం జిల్లాలో కొనసాగుతోంది. ప్రస్తుతం బీఎల్‌వోలు నోటీసులు జారీ చేస్తున్నారు. శనివారం వరకు 36,664 మందికి నోటీసుల జారీ పూర్తయింది. అయితే మొన్నటి వరకు నోటీసులు జారీ అయిన వ్యక్తే ఏఈఆర్వో, ఈఆర్వో ఎదుట హాజరయ్యే విధంగా నిబంధనలు ఉండేవి. కేవలం ఎన్ఆర్ఐలు, వీవీఐపీలకు మాత్రమే మినహాయింపు ఉండేది. ఇప్పుడు నిబంధనలను ఎన్నికల సంఘం సరళతరం చేసింది. నోటీసులు జారీ అయిన వ్యక్తికి సంబంధించిన కుటుంబీకుల్లో ఎవరైనా అధికారుల వద్దకు వెళ్లి వివరాలు, ధ్రువపత్రాలు సమర్పించాలి. అధికారులు అడిగే ప్రశ్నలకు జవాబు చెబితే సరిపోతుంది. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 2,102 మంది విచారణ పూర్తయింది.

రెండోసారి కూడా అవకాశం..

అర్హులైన ప్రతీ ఓటరు పేరును జాబితాలో ఉంచడానికి ఎన్నికల సంఘం తీవ్రంగా శ్రమిస్తుంది. సర్ నోటీసులు తీసుకునే ఓటర్లు అందుబాటులో లేకపోవడం, వివిధ కారణాలతో విచారణకు హాజరు కాకుంటే వారికి రెండోసారి కూడా అవకాశం కల్పిస్తారు. బీఎల్‌వోలు వారికి మరోమారు సమాచారం అందిస్తారు. ఎప్పుడు హాజరు కావాలో పేర్కొంటారు. అయితే జిల్లాలో స్థానికంగా నివాసం ఉంటున్న చాలా మంది విచారణకు హాజరవుతున్నారు. అధికారులు అడిగిన పత్రాలను సమర్పిస్తున్నారు.

వివరాలు

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	జారీకానున్న నోటీసులు	పంపిణీ చేసిన నోటీసులు	విచారణ పూర్తయినవి
జుక్కల్	256	54,227	13,159	458
ఎల్లారెడ్డి	283	56,460	11096	709
కామారెడ్డి	271	74,055	12,409	935

చిన్న పొరపాట్లే..

చిన్న, చిన్న పొరపాట్ల వల్ల చాలా మందికి సర్ నోటీసులు జారీ అయ్యాయి. 2002 ఓటరు జాబితాలో ఇంటి పేరు, పూర్తి పేరులో తప్పులు ఉన్న ఓటర్లకు ఇప్పుడు నోటీసులు అందుతున్నాయి. వారందరూ వారి, వారి ఆధార్‌కార్డులు, స్టడీ సర్టిఫికేట్‌లను విచారణ సమయంలో అధికారులకు అందజేస్తున్నారు. ఇలాంటి తప్పులు దొర్లిన వారు ఇప్పుడే జాగ్రత్త పడాలి. ఫారమ్-8 ద్వారా తప్పులను సవరించుకోవడానికి అవకాశం ఉంది. ఎవరైతే తమ పేరు, ఇంటి పేర్లలో తప్పులు ఉన్నాయని భావిస్తున్నారో అలాంటి వారు బీఎల్‌వోల వద్ద నుంచి ఫారమ్-8 తీసుకొని పూరించి అందజేయాలి.

రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో తెలంగాణ ఏకలవ్య పాఠశాల విద్యార్థులు

రాష్ట్రపతికి రాఖీ కట్టిన గాంధారి విద్యార్థిని

గాంధారి, న్యూస్‌టుడే: రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకొని దిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించిన వేడుకల్లో స్థానిక ఏకలవ్య పాఠశాలకు చెందిన విద్యార్థిని పాల్గొని మండలానికి గర్వకారణంగా నిలిచింది. రాష్ట్రంలోని 23 ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల నుంచి ఎంపికైన విద్యార్థుల బృందం రాష్ట్రపతి భవన్ ఆహ్వానం అందుకుంది. వీరిలో గాంధారి ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న రాధిక కూడా ఉంది. రాష్ట్రపతి ముర్మును కలిసి రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపింది. ఈ సందర్భంగా రాధికను పాఠశాల ప్రిన్సిపల్ రవీందర్‌కుమార్, ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.

వేగంగా ప్రక్రియ

మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ ప్రతిమాసింగ్

కామారెడ్డి కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో సర్ ప్రక్రియ వేగంగా సాగుతోందని జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ ప్రతిమాసింగ్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి శనివారం నిర్వహించిన వీసీలో ఆమె మాట్లాడారు. జిల్లాలో 1,84,742 మంది ఓటర్లకు నోటీసులు జనరేట్ చేసినట్లు చెప్పారు. ఇందులో ఇప్పటి వరకు 36,664 మందికి నోటీసులు జారీ చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విక్టర్, శిక్షణ డిప్యూటీ కలెక్టర్ రవితేజ, కామారెడ్డి తహసీల్దార్ హిమబిందు, సూపరింటెండెంట్ రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి

పెద్దకొడప్‌గల్, న్యూస్‌టుడే: ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే, మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్‌లు పేర్కొన్నారు. పెద్దకొడప్‌గల్ మాజీ ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల వైఫల్యాలపై జుక్కల్ నియోజక వర్గ సమరభేరి సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి వారు హాజరై మాట్లాడారు. భారాస రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆదేశాల మేరకు సెప్టెంబరు 2వ తేదీ నుంచి పక్షం రోజుల పాటు నిర్వహించే కార్యక్రమాలను విజయవంతం చేయడానికి భారాస నాయకులు, నియోజకవర్గ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ ఛైర్మన్ దఫేదర్ రాజు, సర్ నియోజక వర్గ ఇన్‌ఛార్జి భిక్షపతిస్వామి, పలు మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లింగంపేట: మండలంలోని లింగంపల్లి(ఖుర్దు)లోని ఓ వేడుకల మండపంలో నిర్వహించిన ఎల్లారెడ్డి నియోజకవర్గ స్థాయి భారాస ముఖ్య నాయకుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్, మాజీ ఎమ్మెల్సీలు వీ.జీ.గౌడ్, శేరి సుభాష్ రెడ్డి పాల్గొని మాట్లాడారు.

అభివృద్ధి పనుల ప్రతిపాదనల అందజేత

మంత్రి సీతక్కకు అందజేస్తున్న ఎమ్మెల్యే మదన్ మోహన్

ఎల్లారెడ్డి, న్యూస్‌టుడే : ఎల్లారెడ్డి నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ఎమ్మెల్యే మదన్ మోహన్ రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్కను శనివారం కలిసి పలు అభివృద్ధి పనుల ప్రతిపాదనలను అందజేశారు. అంగన్‌వాడీ భవనాలు, రహదారులు, వంతెనలు, స్టేడియం, సీడీ వర్క్స్, గోదాములకు రోడ్డు సౌకర్యం, నాగిరెడ్డిపేట్, ఎల్లారెడ్డి మండలాల్లో నూతన ఎంపీడీవో కార్యాలయ భవనాల నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని మంత్రిని కోరారు. సీతక్క సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

తెలంగాణ తిరుమలలో వరుణ యాగం

పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పోచారం

బీర్కూర్, న్యూస్‌టుడే : బీర్కూర్ శివారులోని తెలంగాణ తిరుమల ఆలయంలో శనివారం ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, ఆలయ ధర్మకర్త పోచారం శంభురెడ్డి కుటుంబ సభ్యులు కలిసి వరుణయాగం, సుదర్శనయాగం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి సహస్రనామ అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని శ్రీవారిని కోరుతూ లోక కల్యాణార్థం పూజలు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం పోచారం సురేందర్‌రెడ్డి భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సర్పంచులు అప్పారావు, దేవిసింగ్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆసుపత్రికి వెళ్లాలంటే.. అవస్థలే..!

పిట్లం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలోకి వెళ్లాలంటే రోగులు, ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. మట్టి దారి కావడంతో చిన్న వర్షానికి నీరు నిలిచి చిత్తడిగా మారుతోంది. భారీ వర్షం కురిస్తే మాత్రం బురద నీటిలోంచి వెళ్తూ అగచాట్లు తప్పడంలేదని ప్రజలు వాపోతున్నారు. అధికారులు చొరవచూపి మట్టి దారిని సీసీగా మార్చేందుకు కృషి చేయాలని రోగులు, ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, పిట్లం**

నిర్లక్ష్యం.. అల్లుకుంది...

ఎల్లారెడ్డి మండలం భిక్కనూర్‌లో ఓ విద్యుత్తు స్తంభం పైకి వెళ్లిన తీగ జాతీ మొక్కలు. విద్యుత్తు తీగలతో అల్లుకున్నాయి. స్తంభం చుట్టూ పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. దీంతో ప్రమాదం జరిగే వీలు ఉంది. ట్రాన్స్‌కో అధికారులు పరిశీలించి తీగ జాతి మొక్కలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, ఎల్లారెడ్డి**

రైతుల శ్రేయస్సుకు పనిచేయాలి

దోమకొండ, న్యూస్‌టుడే: దోమకొండలో శనివారం నిర్వహించిన పీఏసీఎస్ పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవానికి ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీతో పాటు ఎంపీ సురేష్ షెట్కార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా షబ్బీర్‌అలీ మాట్లాడుతూ.. రైతుల శ్రేయస్సు కోసం నిరంతరం పని చేసి గుర్తింపు తెచ్చుకోవాలని పాలకవర్గానికి సూచించారు. పార్టీ కోసం పనిచేసినవారిని గుర్తించి పదవులు ఇచ్చామని తెలిపారు. ఛైర్మన్‌గా అనంతరెడ్డి, డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం పీఏసీఎస్ కార్యాలయంలో ఛైర్మన్ పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆయనను షబ్బీర్‌అలీ, సురేష్‌షెట్కార్, జిల్లా సహకార అధికారి రామ్మోహన్ అభినందించారు. కార్యక్రమంలో సర్పంచులు ఐరేని నర్సయ్య, సంజీవ్, మాజీ జడ్పీటీసీ తిర్మల్‌గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆశబోయిన శ్రీనివాస్, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు మధు పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణ పనులకు ఆదేశం

భిక్కనూరు, న్యూస్‌టుడే: భిక్కనూరు చర్చి గేటు వద్ద 44వ జాతీయ రహదారి నుంచి సిద్ధరామేశ్వర దేవాలయానికి వెళ్లే సర్వీస్ రోడ్డును, బీటీఎస్ వద్ద జాతీయ రహదారిని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, ఎంపీ సురేష్ షెట్కార్ శనివారం పరిశీలించారు. బీటీఎస్ వద్ద ప్రయాణికుల సౌకర్యార్థం 44వ జాతీయ రహదారిపై ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని షబ్బీర్‌అలీ ఎన్‌హెచ్ఏఐ అధికారులను ఆదేశించారు.

దోమకొండ పీఏసీఎస్ ప్రతినిధులతో షబ్బీర్‌అలీ, ఎంపీ సురేష్‌షెట్కార్

అక్రమ నిర్మాణాలపై నిరసన

బీర్కూర్, న్యూస్‌టుడే : తమ భూమిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాన్ని నిలిపివేయించి తిరిగి భూమిని ఇప్పించాలని బాధిత కుటుంబ సభ్యులు కోరారు. ఈ మేరకు శనివారం బీర్కూర్ పంచాయతీ కార్యాలయం వద్ద వారు బైఠాయించారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చిత్రపటాలు పట్టుకుని తమ సమస్య పరిష్కరించాలని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు గంగామణి, శంకర్, కుమార్, ప్రకాష్ తదితరులు విలేకరులతో మాట్లాడారు. తమ భూమిని ఓ వ్యక్తి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు. ఈ విషయమై అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదన్నారు. తమకు రావాల్సిన భూమిని సర్వే చేయించకుండా సదరు వ్యక్తి అడ్డుకుంటూ ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు.

ప్రమాదాల నివారణకు చౌరస్తా విస్తరణ

బాన్సువాడ పట్టణం, న్యూస్‌టుడే : ప్రమాదాలను నివారించేందుకు తాడ్కోల్ చౌరస్తాను విస్తరిస్తున్నట్లు ఆగ్రోస్ ఛైర్మన్ కాసుల బాల్‌రాజ్ అన్నారు. చౌరస్తా విస్తరణ పనులను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల చిన్నారి మృతిచెందడం బాధాకరమన్నారు. భవిష్యత్తులో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

అభివృద్ధిపై చర్చకు సిద్ధమా?

కామారెడ్డి నేరవిభాగం: వరద ప్రభావిత ప్రాంతానికి నిధులు ఇవ్వని వారికి పిండ ప్రదానం చేస్తే తప్పేంటని కామారెడ్డి భారాస కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యుడు పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని మాజీ ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ ఇంట్లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఏడాదిగా డివైడర్ల మధ్య విద్యుద్దీపాలు వెలగడం లేదని.. ఆ దారి వెంట వెళ్తుంటే కనిపించడం లేదా అని అధికార పార్టీ నేతలను ప్రశ్నించారు. రూ.5 లక్షలతో జీవదాన్ నుంచి చెరువు వద్దకు వెళ్లే రహదారి పూర్తవుతుందని.. అది కూడా చేయలేదన్నారు. సీఎం వచ్చి వెళ్లినా.. కామారెడ్డికి కనీసం రూపాయి కూడా ఇవ్వకపోవడం శోచనీయమని వారు విమర్శించారు. పదేళ్లలో భారాస చేసిన అభివృద్ధి.. మూడేళ్లలో కాంగ్రెస్ చేసిన అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అని సవాలు విసిరారు. ఎమ్మెల్యే ఎక్కడా కనిపించడం లేదని, వరద సమయంలోనూ ఆయన బాధిత ప్రజల పట్ల అమానుషంగా మాట్లాడారన్నారు.

మాట్లాడుతున్న భారాస కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యుడు

దోమకొండ: గెలుపొందిన విద్యార్థులకు కప్ అందిస్తున్న అదనపు కలెక్టర్లు విక్టర్, ఎన్.వై.గిరి

బాన్సువాడ సరస్వతి శిశుమందిర్‌లో క్రీడా పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

క్రీడల్లో గెలుపోటములు సహజం

క్రీడల్లో గెలుపోటములు సహజమని వక్తలు పేర్కొన్నారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా పలు పాఠశాలలు, కళాశాలల్లో వివిధ ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. **- న్యూస్‌టుడే, బృందం**

పుల్కల్ పీఎం శ్రీ పాఠశాలలో ధ్యాన్‌చంద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

గాంధారి: పేట్‌సంగెం మైదానంలో వాలీబాల్ పోటీలు

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

మహమ్మద్‌నగర్, నిజాంసాగర్, న్యూస్‌టుడే: సింగితం రిజర్వాయర్ రక్షణ గోడ మరమ్మతులకు రూ.83.5 లక్షలు, నర్వ పాత చెరువు పంట కాలువల మరమ్మతులకు రూ.48 లక్షల నిధుల మంజూరుకు కృషి చేసిన జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావుకు ఆయకట్టు రైతులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు మహమ్మద్‌నగర్ మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి , ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, సర్పంచులు రమేష్, జీవన్, రాములు, సాయికిరణ్, హరీన్‌కుమార్, ఆయా గ్రామాల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే చర్యలు

జుక్కల్, న్యూస్‌టుడే: ఎరువులు, పురుగుల మందులను అధిక ధరకు విక్రయిస్తూ.. ఇష్టారాజ్యంగా వ్యహరిస్తే చర్యలు తప్పవని ఇన్‌ఛార్జి ఏవో రాజు హెచ్చరించారు. శనివారం జుక్కల్‌లోని దుకాణాలను తనిఖీ చేశారు. గుండూర్‌లో యూరియా యాప్‌పై రైతులకు అవగాహన కల్పించారు. వెంట గుండూర్ సర్పంచి కాశీనాథప్ప, ఏఈవోలు పండరి, శ్రీలేఖ, తదితరులు ఉన్నారు.

నూతన స్తంభాలు, నియంత్రిక ఏర్పాటు

గాంధారి, న్యూస్‌టుడే: వెంకటాపూర్ తండాలో గత కొన్ని రోజులుగా విద్యుత్తు సమస్యలతో స్థానికులు సతమతమవుతున్నారు. ఈ నేపథ్యంలో విద్యుత్తు అధికారులు, సిబ్బంది, సర్పంచి చొరవ తీసుకొని గ్రామంలో నూతనంగా 20 కొత్త స్తంభాలను ఏర్పాటు చేసి తీగలు లాగారు. అనంతరం 25కేవీ సింగిల్ ఫేజ్ నియంత్రికను అమర్చారు. తండాకు (రాఖీ పౌర్ణమికి) విచ్చేసిన బుల్లితెర హాస్యనటుడు చమ్మక్ చంద్ర, ఏడీఈ మల్లేష్, సర్పంచి మీరిబాయితో కలిసి నూతన నియంత్రికను ప్రారంభించారు. సర్వాపూర్ ఏఈ నాగరాజు, నాయకులు భీమ్‌రావ్, విద్యుత్తు సిబ్బంది అమీరుద్దీన్, ప్రవీణ్ పాల్గొన్నారు.

విద్యుత్తు సరఫరాలో అంతరాయం నేడు

బాన్సువాడ : విద్యుత్తు తీగల మరమ్మతులు, కొత్త స్తంభాల ఏర్పాటులో భాగంగా బాన్సువాడలో ఆదివారం విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ సంతోష్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తాడ్కోల్ రోడ్డు, వాసవి కాలనీ, ఫిర్దోస్ కాలనీ, కోట గల్లీ, బీడీ వర్కర్స్‌కాలనీ, అరాఫత్ కాలనీ, బాలాజీనగర్, కొయ్యగుట్ట రోడ్డు, సంగమేశ్వర మూడు, నాలుగో రోడ్‌లలో ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 1:30 వరకు విద్యుత్తు సరఫరా ఉండదని వివరించారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కృషి చేస్తున్నామని తెలంగాణ రక్షణ సేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి రవీందర్‌గుప్తా అన్నారు. జిల్లాకేంద్రంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 31న నిజామాబాద్‌లో తలపెట్టిన పార్టీ బహిరంగ సభను విజయవంతం చేయాలన్నారు. రాములు, దేవేందర్, ఏసు, సన తదితరులున్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహకం అందజేత

మాచారెడ్డి, న్యూస్‌టుడే: పాల్వంచ మండలం భవానిపేట జడ్పీహెచ్ఎస్‌లో చదివి పదోతరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మంద గంగారెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు సమరసింహారెడ్డి రూ.15 వేలను ప్రోత్సాహకంగా శనివారం అందజేశారు.

పనులను వేగవంతం చేయాలి

కామారెడ్డి గ్రామీణం: అపరిష్కృత పనులను వేగవంతం చేయాలని జడ్పీ సీఈవో చందర్‌నాయక్ అన్నారు. కామారెడ్డి మండలం తిమ్మక్‌పల్లిలో ప్రగతి పనులను ఆయన శనివారం పరిశీలించారు

మాజీ సర్పంచి మృతి

సదాశివనగర్, న్యూస్‌టుడే : సదాశివనగర్ మండలం మల్లుపేట శివారులోని 44వ నంబరు జాతీయరహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో చికిత్స పొందుతూ మాజీ సర్పంచి మృతిచెందినట్లు ఎస్సై పుష్పరాజ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మల్లుపేటకు చెందిన మాజీ సర్పంచి **బాలకిషన్(43)** శుక్రవారం రాత్రి తన ద్విచక్రవాహనంపై కిరాణా సామగ్రి కొనుగోలు చేసేందుకు సమీపంలోని పద్మాజివాడి క్రాస్‌రోడ్డుకు వెళ్లారు. అనంతరం తిరుగు ప్రయాణంలో ముందు వెళ్తున్న వాహనం ఒక్కసారిగా ఎడమవైపుకు తిప్పడంతో వెనుకనుంచి ఆ వాహనాన్ని ఢీకొట్టడంతో బాలకిషన్‌కు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రున్ని చికిత్స నిమిత్తం నిజామాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

ప్రయాణికుడి కాలుపై నుంచి వెళ్లిన బస్సు చక్రం

భిక్కనూరు: భిక్కనూరు బస్టాండ్‌లో శనివారం ఆర్టీసీ బస్సు టైరు ప్రయాణికుడి కాలుపై నుంచి వెళ్లడంతో తీవ్ర గాయాలయ్యాయి. బస్సు ఎక్కే ప్రయత్నంలో అదుపు తప్పి ప్రయాణికుడు కిందపడిపోయాడు. బస్సు డ్రైవర్ గమనించకపోవడంతో ప్రయాణికుడి కాలుపై నుంచి టైరు వెళ్లగా కాలు నలిగిపోయింది. తీవ్ర రక్తస్రావం కావడంతో ప్రయాణికుడు స్పృహ తప్పి పడిపోయాడు. స్థానికులు క్షతగాత్రుడిని అంబులెన్సులో ఆసుపత్రికి తరలించారు. భిక్కనూరు పోలీసులు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు

సైబర్ నేరాలతో జాగ్రత్త

మాచారెడ్డి, న్యూస్‌టుడే: సైబర్ నేరాలు, డ్రగ్స్, రోడ్డు ప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. మాచారెడ్డి పోలీసుస్టేషన్ పరిధిలోని పాల్వంచలో శనివారం కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. డీఎస్పీ మధుసూదన్ మాట్లాడుతూ.. గుర్తుతెలియని ఏపీకే ఫైళ్లు, యాప్‌లను ఇన్‌స్టాల్ చేయొద్దని, ఓటీపీ, బ్యాంకు వివరాలను ఎవరికీ వెల్లడించొద్దని సూచించారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930కు ఫోన్ చేయాలన్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించి ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచి శేఖర్, గ్రామీణ సీఐ శ్రీధర్ గౌడ్, ఎస్సై విజయ్, ఆర్ఎస్సై చంద్రశేఖర్, షీ టీం ఇన్‌ఛార్జి సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

పాల్వంచలో మాట్లాడుతున్న డీఎస్పీ మధుసూదన్

తెలుగు భాషా దినోత్సవం

బీర్కూర్ ఉన్నత పాఠశాలలో తెలుగు కవుల చిత్రపటాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

బీర్కూర్, న్యూస్‌టుడే: బీర్కూర్ ఉన్నత పాఠశాలలో శనివారం తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి 70 మంది తెలుగు కవుల చిత్రపటాలను ప్రదర్శించారు. తెలుగు భాషా ప్రాధాన్యాన్ని, తెలుగు కవుల జీవిత చరిత్రను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి హెచ్ఎం శివరాం, ఉపాధ్యాయులు విద్యాసాగర్, ఆంజనేయులు, సంజీవ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రావి ఆకుపై ...

మద్నూర్: తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు బాస బాలకిషన్ తన కళా ప్రతిభను చాటుకున్నారు. రావి ఆకు పై తెలుగు భాషా దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ దేశ భాషలందు తెలుగు లెస్స అని అద్భుతంగా లిఖించారు. ఈ చిత్రాన్ని చూసిన పలువురు ఆయనను ప్రశంసించారు.

(c) eenadu